**నీళ్లు పారక.. పంటలు పండక..**







**మరమ్మతులకు మోక్షమెప్పుడో.!!**



AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## 23న విద్యాసంస్థల బంద్

**అక్షరటుడే, ఇందూరు:** రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం నగరంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ స్కూళ్లు, జూనియర్ కళాశాలల్లో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నా నిర్లక్ష్యం చేయడం సబబు కాదని పేర్కొన్నారు. దీనిని నిరసిస్తూ.. ఈనెల 23న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం తదితరులు పాల్గొన్నారు.





బోనాల సంబురంలో పాల్గొన్న చిందు కళాకారులు





నిజామాబాద్‌లో పట్టణ గాండ్ల సంఘం ఆధ్వర్యంలో బోనాల సంబురంలో పాల్గొన్న మహిళలు



## బోనాల సంబురం

ఆషాఢ మాసం చివరి ఆదివారం కావడంతో ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా బోనాల సందడి నెలకొంది. ఆయా కుల సంఘాలతో పాటు పలు ఆలయ అభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో ఊరేగింపులు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు.. శివసత్తుల పూనకాలతో ఆద్యంతం ఆకట్టుకున్నారు. నిజామాబాద్ నగరంతో పాటు బోధన్, బాన్సువాడ, మద్నూర్, లింగంపేట తదితర ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు నిర్వహించారు. నిజామాబాద్ నగరంలో గాంధీ గాంధీగంజ్ రిటైల్ కూరగాయల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో, వివిధ కుల సంఘాల ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. నుడా ఛైర్మన్ కేశ వేణు హాజరయ్యారు. నాని యాదవ్ మాతంగి బోనంతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. బాన్సువాడలో ఎమ్మెల్యే పోచారం బోనం ఎత్తుకున్నారు. - అక్షరటుడే, ఇందూరు

## ఆర్టీసీ డ్రైవర్లకు రేపటి నుంచి శిక్షణ

**అక్షరటుడే, ఇందూరు:** ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ డ్రైవర్లకు ఈ నెల 21 నుంచి 23వ తేదీ వరకు పలు అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. పోలీసు శాఖ, టీజీఎస్ ఆర్టీసీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రీజినల్ మేనేజర్ కార్యాల యంలో శిక్షణ ఉంటుందన్నారు. ప్రధానంగా డ్రైవర్ భద్రత, పనితీరు మెరుగుదల, డ్రైవర్ పాత్ర, బాధ్యతలు, ప్రవర్తన సూచనలు, ప్రమాద నివారణ పద్ధతులు, ఇంధన వినియోగ సామర్థ్యం, ప్రజలతో ప్రవర్తించే విధానం, ఆర్టీసీ మార్గదర్శకాలు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

## తమిళనాడు తీర్థయాత్రకు టూర్ ప్యాకేజ్




**అక్షరటుడే, బాన్సువాడ:** తమిళనాడులోని ప్రముఖ ఆలయాల తీర్థ యాత్రకు ఈనెల 27న బాన్సువాడ నుంచి ఆర్టీసీ టూర్ ప్యాకేజీ కింద ప్రత్యేక బస్సు నడపనున్నట్లు డీఎం సరితాదేవి తెలిపారు. 27న మధ్యాహ్నం మూడు గంటలకు బాన్సువాడ నుంచి బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. కాణిపాకం, అరుణాచలం గిరి ప్రదర్శన, అనంతరం గోల్డెన్ టెంపుల్ దర్శనం ఉంటుందని పేర్కొన్నారు. ఈనెల 30న రాత్రి 12 గంటల వరకు బాన్సువాడకు తిరిగి చేరుకుంటుందన్నారు. టికెట్ ధర పెద్దలకు రూ. 5,100, పిల్లలకు రూ. 2,600 ఉందని, బుకింగ్ కోసం గోపి కృష్ణ 9063408477 ఫోన్ నంబరును సంప్రదించాలని ఆమె కోరారు.

## ఆర్టీసీ డిపోల్లో అప్రెంటీస్ శిక్షణ

**అక్షరటుడే, ఇందూరు:** తెలంగాణ ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ పరిధిలోని వివిధ డిపోలలో అప్రెంటీస్ శిక్షణ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇంజినీరింగ్, గ్రాడ్యుయేట్, డిప్లొమా పూర్తి చేసిన వారు ఇందుకోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల్లోకి వెళ్తే.. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆయా ఆర్టీసీ డిపోలో మూడు సంవత్సరాల అప్రెంటీస్ శిక్షణ కోసం అవకాశం కల్పిస్తున్నట్లు రీజినల్ మేనేజర్ జ్యోత్స్న తెలిపారు. 2021, ఆ తర్వాత ఇంజినీరింగ్, డిప్లొమాలో ఆటోమొబైల్, మెకానిక్ అభ్యర్థులు, డిగ్రీలో బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీఏ చేసిన వారు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను నేషనల్ అప్రెంటీస్ ట్రైనింగ్ స్కీం వెబ్ పోర్టర్‌లో నమోదు చేసుకొని టీజీ ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ లో అప్లయ్ చేసుకోవాలని కోరారు. మెరిట్ ప్రకారం ఎంపిక ఉంటుందని పేర్కొన్నారు.

ప్రభుత్వాలు మహిళా సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశ పెడుతున్నాయి. మహిళలు అన్ని రంగాల్లో రాణించేలా వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా వారికి రుణాలు ఇస్తూ.. వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సాహం అందిస్తోంది. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా రుణాలు పొందిన ఎందరో మహిళలు స్వయం ఉపాధి పొందుతున్నారు. - అక్షరటుడే, కామారెడ్డి

# మహిళలు.. మహారాణులు



- పథకాల్లో ప్రాధాన్యతనిస్తున్న ప్రభుత్వాలు
- మహిళా సంఘాలకు ఆర్థిక చేయూత
- వ్యాపారాలకు ప్రోత్సాహం

కామారెడ్డి జిల్లాలో మున్సిపాలిటీలు మినహా గ్రామీణ ప్రాంతాల్లో మొత్తం 17,104 మహిళా సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,79,163 మంది మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు. 202526 సంవత్సరానికి 14,647 మహిళా సంఘాలకు రూ.805 కోట్ల రుణాలను అందించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించగా ఇప్పటివరకు రూ.140 కోట్ల రుణాలను అందజేశారు. ఒక్కో సంఘానికి గరిష్టంగా రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం పొందే అవకాశం ఉంది.

### స్త్రీనిధి రుణ లక్ష్యం రూ.95 కోట్లు

జిల్లాలో మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీతో పాటు స్త్రీనిధి రుణాలను కూడా అందజేస్తున్నారు. తక్కువ వడ్డీ తో వచ్చే ఈ రుణాలు మహిళలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఒక్కో మహిళలు గరిష్టంగా రూ.3 లక్షల వరకు స్త్రీనిధి రుణం ఇస్తారు. జిల్లాలో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.95 కోట్ల రుణాలు అందించాలని లక్ష్యం పెట్టగా.. ఇప్పటికే రూ.20.01 కోట్ల రుణాలను అందజేశారు.

### వడ్డీ రాయితీతో చేయూత

మహిళా సంఘాలకు లింకేజీ ద్వారా ఇచ్చే రుణాలకు ప్రభుత్వం వడ్డీ రాయితీ ఇస్తుంది. సక్రమంగా రుణాలు చెల్లించే వారికి వడ్డీ రాయితీ విడుదల చేస్తుంది. ఇటీవల సున్న వడ్డీ నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. జిల్లాలో ఇప్పటివరకు రూ.15.20 కోట్ల వడ్డీ రాయితీ సొమ్మును మహిళా సంఘాల ఖాతాల్లో అధికారులు జమ చేశారు.

### మున్సిపాలిటీల్లో రుణాలు వివరాలు..

జిల్లాలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలు



ఉన్నాయి. ఈ మూడు మున్సిపాలిటీల పరిధిలో 2,642 మహిళా సంఘాల్లో 26,420 మంది సభ్యులున్నారు. బ్యాంకు లింకేజీల ద్వారా రూ.86.42 కోట్లు రుణం ఇవ్వాల్సి ఉండగా.. రూ.19.86 కోట్ల మేర రుణాలు అందజేశారు.

### స్వయం ఉపాధి.. వ్యాపారాలు

మహిళా సంఘాల ద్వారా రుణాలు పొందిన మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుతున్నారు. పలువురు వ్యాపారాలు చేస్తూ రాణిస్తున్నారు. వారికి మరింత అండగా ఉండేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా జిల్లాలో నాలుగు క్యాంటీన్లను అప్ప గించింది. కామారెడ్డి కలెక్టరేట్, బాన్సువాడ, సదాశివనగర్, ఎల్లారెడ్డిలో ఈ క్యాంటిన్లు విజయవంతంగా కొనసాగుతున్నాయి. అలాగే నాగిరెడ్డిపేట, పిట్లం మండలాల్లో రూ.20 లక్షలతో సోలార్ ప్లాంట్లను కూడా మహిళా సంఘాలకు అప్పగించింది. అలాగే జిల్లాలో రెండు పెట్రోల్ బంకులను సైతం మహిళా సంఘాలకు కేటాయించనుంది. బంకుల ఏర్పాటుకు కావాల్సిన స్థల సేకరణపై అధికారులు దృష్టి పెట్టారు.

### మున్సిపాలిటీల్లో జోరుగా వ్యాపారాలు

జిల్లాలోని మున్సిపాలిటీల్లో మెప్మా అధికారులు మహిళా సంఘాల సభ్యులకు స్వయం ఉపాధిపై అవగాహన కల్పిస్తున్నారు. రుణాలు పొందిన వారు వాటితో యూనిట్లు నెలకొల్పేలా ప్రోత్సాహం, శిక్షణ ఇస్తున్నారు. దీంతో మూడు మున్సిపాలిటీల్లో పలువురు మహిళలు క్యాంటిన్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, క్యాటరింగ్, కుట్టు మిషన్ సెంటర్, ఫ్యాన్సీ స్టోర్, కిరాణా షాపులు, సారీ రోలింగ్, డెయిరీ, బేకరీలు, బ్యూటీ పార్లర్ నిర్వహిస్తూ ఉపాధి పొందుతున్నారు.

### నూతన సంఘాల ఏర్పాటు

జిల్లాలో ఇప్పటికే 17 వేల మహిళా సంఘాలు ఉండగా కొత్తగా మరిన్ని సంఘాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహిళా సంఘాల్లోని సభ్యులకు ప్రమాద బీమా కూడా అమలు చేస్తోంది. ప్రమాదవశాత్తు మరణించిన మహిళల కుటుంబాలకు రూ.10 లక్షల బీమా అందిస్తోంది.

### మహిళలను చైతన్య పరుస్తున్నాం



కామారెడ్డి జిల్లాలో మూడు మున్సిపాలిటీల పరిధిలో మహిళా సంఘాల సభ్యులను చైతన్యం చేయడానికి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాం. మహిళా సంఘాల్లో ఉంటే కలిగే లాభాలను వివరిస్తున్నాం. వీధి వ్యాపారాలు ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ఫలితంగా మహిళలు అనేక మంది వ్యాపారాల వైపు దృష్టి సారిస్తున్నారు. – శ్రీధర్‌రెడ్డి, మెప్మా పీడీ, కామారెడ్డి

## వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడికి అభినందన



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడకు చెందిన తన శిష్యుడు పిట్ల శ్రీధర్ వడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికవ్వడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం పోచారంను శ్రీధర్ సన్మానించారు. మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్, అంజిరెడ్డి, మాజీ మున్సిపల్ ఛైర్మన్ గంగాధర్, సొసైటీ ఛైర్మన్ కృష్ణారెడ్డి, ఎజాజ్, నార్ల సురేష్, గురు వినయ్ పాల్గొన్నారు.

## జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక






**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా గాండ్ల లింగం, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, కోశాధికారిగా ఆకుల నాగరాజు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బంటు బలరాం, యెండల స్వప్న, సంయుక్త కార్యదర్శిగా అబ్బయ్య, శ్యామల, కార్యవర్గ సభ్యులుగా విజయ్, రాజేశ్వర్, నరేష్, శివకృష్ణ, అఖిల ఎన్నుకున్నారు. కాగా.. పూర్తి కార్యవర్గాన్ని త్వరలోనే నియమిస్తామని నూతన అధ్యక్షుడు లింగం వెల్లడించారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారి బొబ్బిలి చిన్నారెడ్డి, అడ్ హాక్ కమిటీ సభ్యులు, ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొబ్బిలి నర్సయ్య పాల్గొన్నారు. ఎన్నికలకు పరిశీలకులుగా రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ సంఘం నుంచి హనుమంతరావు, జిల్లా యువజన, క్రీడల శాఖ పరిశీలకులుగా మీసాల ప్రశాంత్, ఒలింపిక్ అసోసియేషన్ పరిశీలకుడిగా రమేష్ వ్యవహరించారు.


## మిషన్ భగీరథ నీటిలో పురుగులు..

**అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్న గ్రామస్థులు**



**అక్షరటుడే, నిజాంసాగర్:** మిషన్ భగీరథ నీటిలో పురుగులు వస్తున్నాయని నిజాంసాగర్ మండలం వడ్డేపల్లి వాసులు వాపోతున్నారు. ఇటీవల గ్రామంలో ఓ బాలుడు డెంగీ బారిన పడి అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. అయినా.. గ్రామ పంచాయతీ అధికారుల్లో మార్పు రావడం లేదు. మిషన్ భగీరథ నీటిలో పురుగులు వస్తున్నా కనీసం పట్టించుకోవడం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రోగాలు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శులకు పలుసార్లు విన్నవించినా.. పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం




**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ గంగాధర్ తెలిపారు. తెలుగు/ఇంగ్లిష్ మీడియంలలో బోటనీ, కామర్స్, క్రాప్ ప్రొడక్షన్, ఎకనామిక్స్, హిస్టరీ, గణితం, పొలిటికల్ సైన్స్, తెలుగు, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు, కంప్యూటర్ అప్లికేషన్‌లో రెండు పోస్టుల చొప్పున ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉర్దూ మీడియంలో బోటనీ, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, ఉర్దూ, జువాలజీ సబ్జెక్టులలో ఒక్కో పోస్టు ఖాళీలు ఉన్నాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23 సాయంత్రం నాలుగు గంటల్లోగా దరఖాస్తులను కళాశాలలో అందజేయాలని సూచించారు. 24న ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాల కామారెడ్డిలో ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. సెట్/నెట్/పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు.

## అన్నివర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**అక్షరటుడే, నిజాంసాగర్:** అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పెద్ద కొడప్ గల్ మండలం విఠల్‌వాడికి చెందిన బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు నారాయణ రావ్ కాంగ్రెస్‌లో చేరారు. ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సమక్షంలో ఆదివారం పార్టీలో చేరగా.. ఆయనకు కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, నాయకులు మల్లప్ప పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## మసీద్ పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ‘మజీద్ ఈ మహమ్మదీయ’ ఆవరణలో ఆదివారం ‘ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ’ ఆధ్వర్యంలో స్వచ్ఛ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలనీవాసులు, మజీద్ కమిటీ కలిసి డ్రెయినేజీలు శుభ్రం చేసి, చెత్త చెదారాన్ని తొలగించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు కూడా తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సంస్థ ప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈనెల 22న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉడుత గంగాధర్ గుప్తా పిలుపునిచ్చారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. 250 గజాల స్థలం.. ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం.. పెన్షన్, ఉచిత బస్సు పాస్, హెల్త్ కార్డు, సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి గంజివార్ చందు, భాస్కర్ గౌడ్, కృష్ణ, దత్తు, గంగారాం, హన్మాండ్లు, అర్షద్ పాల్గొన్నారు.



గాంధారికి వెళ్లే దారిలో ఏర్పడిన భారీ గుంతలు

# మరమ్మతులకు మోక్షమెప్పుడో..?

- గుంతలమయంగా మారిన గాంధారి రోడ్డు
- పట్టించుకోని అధికారులు

**గాంధారి మండలకేంద్రంలోని ఆర్అండ్‌బీ రోడ్డు అధ్వాన్నంగా తయారైంది. పూర్తిగా గుంతల మయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహన దారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు సైతం లేకపోవడంతో వేగంగా వచ్చే వాహనాలు నియంత్రించలేక ప్రమాదాలు జరుగుతున్నాయి.**

**– అక్షరటుడే, గాంధారి**

కామారెడ్డి – బాన్సువాడ మార్గంలో బాన్సువాడ ఎక్స్ రోడ్ నుంచి ముదెల్లి ఎక్స్ రోడ్ వరకు ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయాల్లో గమనించకపోవడంతో ప్రమాదాల బారిన పడిన సందర్భాలున్నాయి. దీంతో రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు మొరపెట్టుకుంటున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే పలు చోట్ల స్పీడ్ బ్రేకర్లు సైతం ఏర్పాటు చేయాల్సి ఉండగా, అధికారులు శ్రద్ధ చూపడం లేదు. ఫలితంగా తరచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బాన్సువాడ ఎక్స్ రోడ్ నుంచి గుడ్ మెట్ శివారు వరకు రోడ్డు అధ్వానంగా మారింది. అలాగే పోతంగల్ వద్ద నూతన రోడ్డు విస్తరణలో కొంత భాగం ఇంకా పూర్తి చేయకుండా కంకరతో సరిపెట్టారు. ఇకనైనా అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



### నివేదికలు పంపాం..

కామారెడ్డి – బాన్సువాడ రోడ్డులో పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపించాం. పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు నిలిచాయి. **– రవి, ఏఈ, ఆర్అండ్‌బీ**

## భీమ్‌గల్‌లో ఆలయాల పరిశుభ్రత



**అక్షరటుడే, ఆర్మూర్:** భీమ్‌గల్‌లో ఆదివారం పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో జంబీ గద్దె, నందీశ్వరాలయం, హరిజనవాడ హనుమాన్ ఆలయాలను శుభ్రం చేశారు. యోగా గురువు అనంత్ రావు, యోగా సెంటర్ నిర్వాహకుడు లింబాద్రి మాట్లాడుతూ.. యువకులు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు.



## ఇందల్వాయి వీడీసీ ఎన్నిక

**అక్షరటుడే ఇందల్వాయి:** మండలంలోని ఇందల్వాయి గ్రామాభివృద్ధి కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా ఖాజాపూర్ మహేందర్, సభ్యులుగా మిట్టపల్లి మధుసూదన్ రెడ్డి, బుట్టి మాణిక్యం, హనుమంతు, సంతోష్, రాజు, శివ గంగాధర్ అంజయ్య నిజాముద్దీన్ ఎన్నికయ్యారు. మాజీ ఛైర్మన్ జితేందర్ మహేందర్‌కు బాధ్యతలు అప్పజెప్పారు. నూతన కమిటీని సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి మాజీ సర్పంచ్‌లు మల్లయ్య, దశరథ్, సుధాకర్ అభినందించారు.

# బోనాల సంబురం



నిజామాబాద్ నగరంలో పోతరాజుల విన్యాసాలు





బాన్సువాడలో బోనమెత్తిన ఎమ్మెల్యే పోచారం



నగరంలోని గాంధీ గంజ్‌లో రిటైల్ కూరగాయల వర్తకుల సంఘం ఆధ్వర్యంలో..



ఒగ్గు కళాకారుల విన్యాసం



మద్నూర్ మండల కేంద్రంలో..



ఎడపల్లి మండలం జానకంపేట్ గ్రామంలో..















# నీళ్లు పారక.. పంటలు పండక..



రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షా లు కురుస్తున్నా.. నిజామాబాద్‌పై మాత్రం వరుణుడు కరుణించడం లేదు. వర్షా భావ పరిస్థితులతో జిల్లాల్లో అనేక బోర్లు ఎత్తిపోతున్నాయి. దీంతో పంటలకు నీరందక ఎండుముఖం పడుతున్నాయి. అనేక చోట్ల పొలాల్లో బోర్లు పోయకపోవడంతో నేల నెర్రలు బారుతోంది. భూగర్భ జలాలు తగ్గిపోయి బోర్లు చెడిపోతున్నాయి. దీంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. కళ్లముందే పంటలు ఎండిపో తుండడంతో ఏమీ చేయలేక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. వరుణ దేవుడి కరుణించి వర్షా లు కురిపించాలని వేడుకుంటున్నారు.

– అక్షరటుడే, స్టాఫ్ ఫొటోగ్రాఫర్



## అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న నాలుగు లారీలు సీజ్



**అక్షరటుడే, ఆర్మూర్ :** ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నా దందా ఆగడం లేదు. అక్రమార్కులు జోరుగా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్నారు. ఇలా అక్రమంగా తరలిస్తున్న నాలుగు ఇసుక లారీలను అధికారులు సీజ్ చేశారు. కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో ఇసుక అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. భారత్ పెట్రోల్ బంక్ వెనుకల ప్రభుత్వ అనుమతి లేకుండా శనివారం రాత్రి సమయంలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నారు. వాటిని వెంటనే సీజ్ చేసి కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఎవరైనా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

## అన్నదాత భూమి కబ్జా.. ఆందోళనతో ఆత్మహత్య



**అక్షరటుడే, కామారెడ్డి:** కబ్జాకు గురైన తన భూమి తిరిగి దక్కుతుందో లేదోనని బెంగతో కామారెడ్డి జిల్లాలో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి మండలం శాబ్దిపూర్ గ్రామంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కృష్ణారెడ్డికి 26 గుంటల భూమి ఉంది. అయితే ఆ భూమిని గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కబ్జా చేశారు. ఈ విషయంలో న్యాయం చేయాలని అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయింది. అధికారుల చుట్టూ తిరగ్గా సర్వే అధికారులు వచ్చి ఆ భూమి ముగ్గురి వ్యక్తుల కబ్జాలో ఉందని తేల్చారు. అయితే ఆ భూమి కోర్టు పరిధిలో ఉన్నట్టు సమాచారం. భూమి కబ్జా కావడంతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఆ రైతును వేధించసాగాయి. దీంతో తన భూమి దక్కుతుందో లేదోనన్న భయంతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే చనిపోయే ముందు తన చావు కారణమైన వారి పేర్లను సూసైడ్ నోట్‌లో రాసి తన కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని పేర్కొన్నట్లు సమాచారం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.